సాక్షి
విశాఖపట్నం

శనివారం । 5 । జూలై । 2025



సీతమ్మధారలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, తూర్పు సమన్వయ కర్త మొల్లి అప్పారావు తదితరులు



దశవతారాల్లో భాగంగా జగన్నాథస్వామి శుక్రవారం శ్రీరామావతారంలో దర్శనమిచ్చారు. పాయకరావుపేట పాండురంగస్వామి ఆలయం తరఫున హోంమంత్రి అనిత స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. – డాబాగార్డెన్స్

న్యూస్‌రీల్

నేడు వైఎస్సార్ సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం



సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం శనివారం జరగనుంది. మధ్యాహ్నం 3 గంటలకు రుషికొండలోని ఏ1–గ్రాండ్ హోటల్‌లో జిల్లా అధ్యక్షుడు కేకే రాజు ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశానికి శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ, ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు, ఎంపీ గొల్ల బాబూరావు, పార్లమెంట్ పరిశీలకులు కదిరి బాబురావు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె. సుభద్ర, నియోజకవర్గ సమన్వయకర్తలు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా కేకే రాజు మాట్లాడుతూ, కూటమి పాలనలో ఏడాదిలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా చేసిన మోసాలను ప్రజలకు తెలియజేసేందుకు 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' పేరిట వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. సమావేశానికి జిల్లాలోని కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, జెడ్పీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, రాష్ట్ర, జిల్లా అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఎంపీటీసీలు, హాజరుకావాలని కేకే రాజు పిలుపునిచ్చారు.


ముగ్గురు పోలీస్ సిబ్బందిపై సస్పెన్షన్

విశాఖ సిటీ: లారీ డ్రైవర్ నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసిన ఆరోపణలపై కంచరపాలెం పోలీస్ స్టేషన్‌కు చెందిన ముగ్గురు సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం సస్పెండ్ చేశారు. గత నెలలో కంచరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో కానిస్టేబుళ్లు వి.సన్నిబాబు, ఎస్.రామకృష్ణ, హోంగార్డు గురునాయుడులకు నైట్ బీట్ డ్యూటీ కేటాయించారు. ఆ రోజు రాత్రి సమయంలో వీరు ఒక లారీ డ్రైవర్‌ను ఆపి నగదు వసూలు చేసినట్లు సీపీకి ఫిర్యాదు అందింది. విచారణలో సదరు పోలీసులు అక్రమంగా డబ్బు తీసుకున్నట్లు నిర్ధారణ అయింది. దీంతో వీరిని సస్పెండ్ చేశారు.

పార్క్ స్థలాలపై ఓపెన్ కుట్ర!



- స్వయంగా మంత్రి నారాయణ సిఫారసు
- 'రియల్' ప్రయోజనాలకు మధురవాడ జీవీఎంసీ పార్కు స్థలం
- కనీసం కౌన్సిల్ సమావేశం లేకుండానే పార్కు స్థలాల అప్పగింత
- నరవలోని పార్కు స్థలాన్ని ఓపెన్ స్పేస్‌గా చెబుతూ చక్రం తిప్పిన మరో ఎమ్మెల్యే
- 20 ఎకరాలను రాయించుకుని తన 'గుణా'న్ని బయటపెట్టుకున్న అధికారపార్టీ 'బాబు'
- తతంగమంతా ఆయన 'రియల్' ప్రయోజనాల కోసమే...
- చేష్టలుడిగి చూస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్



జీవీఎంసీ ఆమోదం లేకుండా నేరుగా కమిషనర్ లీజు ఇవ్వడం, అమ్మడం, ఇతర అవసరాలకు బదలాయించడం సాధ్యం కాదని పేర్కొంటూ డీటీసీపీ రాసిన లేఖ

ఇది 1981లో సాంఘిక సంక్షేమశాఖ నరవ రెవెన్యూ గ్రామ పరిధిలో వేసిన లే–అవుట్. ఇందులో మార్క్ చేసింది పార్కు స్థలం. అయితే, ఇప్పుడు అధికార ఎమ్మెల్యే తన 'గుణ'ం చూపించడంతో ఇది కాస్తా పార్కు స్థలం కాకుండా పోయింది. బహిరంగ ప్రదేశం (ఓపెన్ స్పేస్) అని రికార్డులను తారుమారు చేసి వెనుక ఉన్న 20 ఎకరాల రియల్ ఎస్టేట్ భూమికి రోడ్డు కోసం 180 గజాల స్థలాన్ని తీసేసుకునేందుకు అనుకూలంగా మున్సిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ ఆదేశాలు జారీచేశారు.



నరవలో పార్కు స్థలంగా చెబుతున్న లే–అవుట్ కాపీ

ఇది స్వయంగా మున్సిపాలిటీలకు చెందిన పార్కు స్థలాలను కాపాడాల్సిన సంబంధిత మంత్రి నారాయణ మధురవాడలోని బటర్ ఫ్లై పార్కు స్థలాన్ని అప్పగించాలంటూ సిఫారసు చేస్తూ రాసిన లేఖ. దీంతో ఏకంగా కనీసం కౌన్సిల్ సమావేశం కూడా లేకుండానే రోడ్డు కనెక్టివిటీ లేని స్థలాన్ని జీవీఎంసీకి అప్పగించి.. పార్కు స్థలాన్ని కొట్టేశారు.



మధురవాడలోని బటర్ ఫ్లై పార్కు స్థలాన్ని అప్పగించేందుకు వీలుగా కమిటీ వేయాలంటూ మంత్రి నారాయణ స్వయంగా రాసిన సిఫారసు లేఖ

ఈ రెండు వ్యవహారాల్లోనూ నిబంధనల మేరకు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) కౌన్సిల్ అనుమతి తీసుకోవాలి. అయితే రెండింటిలోనూ కేవలం అధికారపార్టీకి చెందిన ఎమ్మెల్యేలు, మంత్రి చక్రం తిప్పడంతో ఏకంగా మున్సిపల్ పార్కు స్థలాలను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించారు. ఒకవైపు జీవీఎంసీ పార్కు స్థలాన్ని అప్పగించి... కనెక్టివిటీ లేని స్థలాన్ని తీసుకుంటుండగా...మరో దగ్గర ఉన్న పార్కు స్థలాన్ని పార్కు కాదు... ఓపెన్ స్పేస్ అంటూ భూ బదలాయింపు కింద రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం తీసుకోవడం గమనార్హం. అయినప్పటికీ మేయర్, డిప్యూటీ మేయర్లు నోరు మెదపకపోవడం గమనార్హం. అంతేకాకుండా పెందుర్తి నియోజకవర్గంలోని నరవ పార్కు స్థలం విషయంలో నియోజకవర్గ ఎమ్మెల్యేకు సంబంధం లేకుండా వేరే నియోజకవర్గ ఎమ్మెల్యే చక్రం తిప్పారు. అంతేకాకుండా సంబంధిత భూములు కూడా ఆయనకు చెందిన బినామీ చేతుల్లోనే ఉన్నాయనే ప్రచారం జరుగుతోంది.

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం

మధురవాడలోని 1.05 ఎకరాల లేఅవుట్ ఓపెన్ స్పేస్‌లో బటర్‌ఫ్లై పార్కును జీవీఎంసీ అభివృద్ధి చేస్తోంది. అయితే, ఈ పార్కు వెనుక స్థానిక కూటమి నేతకు చెందిన 2 ఎకరాల భూమి ఉంది. ఆ నేత తన భూమికి రోడ్డు మార్గం కోసం పార్కు స్థలంలోని కొంత భాగాన్ని తీసుకుని, దానికి బదులుగా తన భూమిలో కొంత స్థలాన్ని జీవీఎంసీకి ఇచ్చేందుకు పావులు కదిపారు. ఇందుకోసం కూటమిలోని సీనియర్ ఎమ్మెల్యేను కలిసి 'వాటాలు' మాట్లాడుకున్నారని తెలుస్తోంది. ఆ ఎమ్మెల్యే తనకున్న మున్సిపల్ శాఖలోని 'బలాన్ని' ఉపయోగించి, స్థలాన్ని అప్పగించేందుకు వీలుగా వ్యవహారాలను నడిపారు. దీనికి అనుగుణంగా మున్సిపల్ శాఖ ఉత్తర్వులు కూడా జారీచేసింది. ఈ బదలాయింపుతో వెనుక ఉన్న 2 ఎకరాల భూమి విలువ ఒక్కసారిగా పెరిగి, గజం ఏకంగా రూ. 50 వేల రిజిస్ట్రేషన్ విలువ పలికే స్థాయికి చేరుకుంది. ఇది కేవలం రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసమే జీవీఎంసీ పార్కు స్థలాన్ని అప్పగించారనడానికి స్పష్టమైన నిదర్శనం.

నరవ రెవెన్యూ గ్రామంలో పార్కు స్థలం మాయం

పెందుర్తి నియోజకవర్గంలోని నరవ రెవెన్యూ, జీవీఎంసీ 88వ వార్డు పరిధిలోని సర్వే నంబరు 10/9లో 1981లో సాంఘిక సంక్షేమశాఖ వేసిన లేఅవుట్‌లో పార్కు స్థలంగా గుర్తించిన 180 గజాల స్థలాన్ని ఇచ్చేయాలని, అందులో 12 మీటర్ల రహదారి నిర్మించుకుంటానని ఆ లేఅవుట్ వెనుక 20 ఎకరాలను తన అనుచరుల చేతుల్లో ఉంచుకున్న కూటమి ఎమ్మెల్యే చక్రం తిప్పారు. వాస్తవానికి ఈ 20 ఎకరాల స్థలం సదరు ఎమ్మెల్యేదే అనే ప్రచారం ఉంది. ఇందుకోసం లేఅవుట్‌లోని పార్కు స్థలాన్ని 'ఓపెన్ స్పేస్'గా అబద్ధపు రికార్డులు సృష్టించి, అనుమతి వచ్చే విధంగా అధికార పార్టీ నేతలు తమ నిజస్వరూపాన్ని చూపించారని తెలుస్తోంది. ఈ రెండు వ్యవహారాల్లోనూ జీవీఎంసీ పరిధిలో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచే పార్కు స్థలాలను కూటమి నేతలు తమ రియల్ ప్రయోజనాల కోసం కాజేస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. అది కూడా కనీసం జీవీఎంసీ కౌన్సిల్ అనుమతి తీసుకోకుండానే ఈ నిర్ణయాలు తీసుకోవడం గమనార్హం.

కౌన్సిల్‌కు తెలియకుండానే...!

వాస్తవానికి జీవీఎంసీలో ఏ నిర్ణయం తీసుకోవాలన్నా కౌన్సిల్, స్టాండింగ్ కౌన్సిల్ అనుమతి తప్పనిసరి. ఒకవేళ అత్యవసర పరిస్థితుల్లో ఏవైనా పనులు చేపట్టినప్పటికీ... తర్వాత ర్యాటిఫై కోసమైనా కౌన్సిల్, స్టాండింగ్ కమిటీకు వెళ్లాల్సిందే. అయితే ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను బలవంతంగా లాక్కోవడం ద్వారా అటు కౌన్సిల్‌లోనూ, ఇటు స్టాండింగ్ కమిటీలోనూ కూటమి నేతలదే మెజార్టీ ఉంది. ఈ నేపథ్యంలో కౌన్సిల్‌లో ఉంచి పార్కు స్థలాల అప్పగింతపై అనుమతి తీసుకునే అవకాశం ఉంది. అయినప్పటికీ కౌన్సిల్‌ను కనీసం పట్టించుకోకుండా వ్యవహారాలు నడుపుతున్నారు. దీనిపై అటు మేయర్ కానీ, ఇటు డిప్యూటీ మేయర్ కానీ కనీసం అడిగే సాహసం కూడా చేయలేకపోవడం దారుణంగా ఉందని ఆ పార్టీ కార్పొరేటర్లే వాపోతున్నారు. అయితే కౌన్సిల్ ముందు ఉంచితే వీటిని వ్యతిరేకించే అవకాశం ఉందనే ఆందోళనతోనే నేరుగా వ్యవహారాలు చక్కబెట్టుకుంటున్నట్టు తెలుస్తోంది. అయినప్పటికీ జీవీఎంసీ కౌన్సిల్ అనుమతితోనే ఈ నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని డైరెక్టర్ ఆఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ స్పష్టంగా తన అభిప్రాయంగా పేర్కొంది. అయినప్పటికీ తోసిరాజని నేరుగా మంత్రి, ఎమ్మెల్యేల సిఫారసుతో వ్యవహారాలను చక్కబెట్టుకుండటంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

టూరిజం సర్క్యూట్ హబ్‌గా భీమిలి

అల్లూరి జయంతిలో మంత్రి కందుల దుర్గేష్

పద్మనాభం : జిల్లాలోని పలు ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు భీమిలిని సర్క్యూట్ హబ్‌గా ఏర్పాటు చేస్తామని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మండపంలోని పాండ్రంగిలో శుక్రవారం నిర్వహించిన అల్లూరి జయంతి వేడుకల్లో ఆయన ఈ విషయం వెల్లడించారు. అల్లూరి సీతారామరాజు జన్మస్థలం పాండ్రంగి, పొట్నూరులోని శ్రీకృష్ణదేవరాయల విజయస్తంభం ,పద్మనాభం యుద్ధ స్థలం, గిరిపై అనంత పద్మనాభస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు. అల్లూరి సీతారామరాజు 22 ఏళ్ల వయసులోనే మన్యంలో గిరిజనులు పడుతున్న కష్టాలు చూసి బ్రిటీష్ వారిపై పోరాటం చేసిన మహనీయుడని ఆయన కొనియాడారు. అల్లూరి ఆలోచనా విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని మంత్రి ఉద్ఘాటించారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు మాట్లాడుతూ, పాండ్రంగి సమీపంలోని గోస్తని నదిపై వంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో సంగీత్ మాధుర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మాజీ ఎమ్మెల్యే ఆర్ఎస్‌డీపీ అప్పలనరసింహరాజు, జనసేన భీమిలి ఇన్‌చార్జి పంచకర్ల సందీప్, సర్పంచ్ పల్లి ఝాన్సీ, ఎంపీటీసీ సభ్యురాలు నారాయణమ్మ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్

తూర్పు తీరంలో పగడపు దిబ్బలు

- అంతర్జాతీయంగా అధికారిక గుర్తింపు
- ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ఆర్కైవ్స్‌లో ప్రచురణ
- చింతపల్లిలో అత్యధిక పగడపు దిబ్బలున్నట్టు గుర్తింపు
- పూడిమడక వద్ద ఉన్న పగడపు దిబ్బలను తరలించేందుకూ అవకాశం

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:



విశాఖ తీరంలోని పూడిమడక, రుషికొండ, మంగమారిపేట, విజయనగరం జిల్లా చింతపల్లి వద్ద అరుదైన పగడపు దిబ్బలకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించింది. ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ ఆర్కైవ్స్‌లో ప్రచురితమైన 'డైవర్సిటీ అండ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫ్ కోరల్ కమ్యూనిటీ ఫ్రం విశాఖపట్నం కోస్ట్, ఏపీ' అనే ఆర్టికల్‌లో ఈ విషయం స్పష్టమైంది. జూలై 1న ప్రచురితమైన ఈ నివేదిక, ఆంధ్రప్రదేశ్ తూర్పు తీరం కూడా పగడపు దిబ్బలకు నెలవుగా ఉందని తేటతెల్లం చేసింది. తద్వారా ఇప్పటివరకు పగడపు దిబ్బలు ఉన్నాయని పేర్కొంటూ వచ్చిన నివేదికలకు అంతర్జాతీయంగా గుర్తింపు లభించిందని జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) చేసిన సర్వేలో పాల్గొన్న లివిన్ అడ్వెంచర్స్ ఫౌండర్ బలరాం 'సాక్షి'కి తెలిపారు. ఇప్పటివరకు పగడపు దిబ్బలు భారతదేశంలో లక్షద్వీప్, అండమాన్–నికోబార్, గల్ఫ్ ఆఫ్ మన్నార్, గల్ఫ్ ఆఫ్ కచ్‌లకే పరిమితమని భావించేవారు. ఇందుకు భిన్నంగా ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పు తీరం కూడా పగడపు దిబ్బలకు నెలవుగా ఉందని అంతర్జాతీయ తేటతెల్లమయింది.

2019 నుంచి 2023 వరకు...!

వాస్తవానికి పగడపు దిబ్బల ఉనికి కోసం డేటాను సేకరించేందుకు, పరిశోధన చేసేందుకు 2019 నుంచి 2023 వరకు విజయనగరం జిల్లాలోని చింతపల్లి నుంచి పూడిమడక వరకూ సర్వే చేశారు. మొత్తం 15 ప్రదేశాల్లో ఈ అధ్యయనం సాగింది. ఈ అధ్యయన నివేదికలు పలుమార్లు వెలువరించారు. అయితే అంతర్జాతీయ గుర్తింపు లభించడం ఇదే మొదటిసారి. తద్వారా ఆంధ్రా తీరం సముద్ర జీవ వైవిధ్యానికి నెలవుగా ఉందని అధికారికంగా గుర్తింపు లభించిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. చింతపల్లి నుంచి పూడిమడక వరకు 15 ప్రదేశాల్లో జరిపిన అధ్యయనం సందర్భంగా సాగర గర్భంలో 30 మీటర్ల లోతుల వరకు అన్వేషణ సాగించారు. స్థానిక స్కూబా డైవింగ్ సంస్థ లివిన్ అడ్వెంచర్స్‌తో కూడిన నలుగురు శాస్త్రవేత్తల బృందం ఈ అధ్యయనాన్ని చేపట్టింది. పొరిటిడే, అగారిసిడె, డెండ్రోఫిలిడే వంటి అరుదైన పగడపు దిబ్బలున్నట్టు గుర్తించారు. వాస్తవానికి చింతపల్లి వద్ద 12 రకాల పగడపు దిబ్బలు, రుషికొండ వద్ద 6, పూడిమడక వద్ద 5, మంగమారిపేట వద్ద 3 రకాల పగడపు దిబ్బలు ఉన్నట్లు గుర్తించారు. చింతపల్లి వద్ద ఎక్కువగా పగడపు దిబ్బలు ఉన్నట్టు తెలుస్తోంది. అయితే, పూడిమడక వద్ద ఉన్న పగడపు దిబ్బల్లో కొంతభాగం తీసి మరో చోటికి తరలించి పెంచేందుకూ అవకాశం ఉందని తేలింది.

యాంటీ క్యాన్సర్ మందుల తయారీకీ...!

సముద్ర గర్భంలో ఉండే ఈ పగడపు దిబ్బలు సముద్ర పర్యావరణ పరిరక్షణకు ఎంతో ఉపయోగమనే అభిప్రాయం ఉంది. పగడాల ద్వారా వచ్చే కాల్షియం కార్బొనేట్ వల్ల ఇవి ఏర్పడతాయి. వీటిలో కొన్ని పోషకాలు ఉంటాయి. ఈ పగడపు దిబ్బల ద్వారా సముద్రంలో ఉండే జీవరాశులు మరింతగా పెరిగేందుకు దోహదం చేస్తాయనేది శాస్త్రవేత్తల అభిప్రాయం. ఈ పగడపు దిబ్బలను యాంటీ బయోటిక్స్, యాంటీ క్యాన్సర్ వంటి మెడిసిన్స్ తయారీలోనూ ఉపయోగిస్తారని తెలుస్తోంది. అంతేకాకుండా సముద్రతీరం కోతకు గురికాకుండా సహజసిద్ధంగా ఇవి కాపాడతాయని కూడా అధ్యయనాల్లో తేలింది. మరోవైపు అలల తీవ్రతను కూడా తగ్గించేందుకు ఇవి దోహదం చేస్తాయి. ఈ నేపథ్యంల ఈ పగడపు దిబ్బలు స్కూబా డైవింగ్, స్నోర్కింగ్ ద్వారా టూరిజం అభివృద్ధికి కూడా దోహదం చేస్తాయి.



విశాఖ సముద్ర గర్భంలో జీవ వైవిధ్యానికి ఈ జలచరాలే నిదర్శనం

అంతర్జాతీయంగా తొలిసారి గుర్తింపు



మన సముద్ర తీరంలో పగడపు దిబ్బలు ఉన్నట్టు గతంలో మేం జీఎస్ఐతో కలిపి జరిపిన అధ్యయనంలో తేలింది. అయితే, ఈ అధ్యయనానికి తొలిసారిగా ఈ నెల 1వ తేదీన ప్రచురణ ద్వారా అంతర్జాతీయ గుర్తింపు లభించింది. పగడపు దిబ్బల ద్వారా మత్స్య సంపదకు ఎంతో ఉపయోగం. కాలుష్యం బారిన పడకుండా వీటిని కాపాడుకోవాల్సిన అవసరం మాత్రం ఎంతో ఉంది.

– బలరాం, లివిన్ అడ్వెంచర్స్, ఫౌండర్

గంటాతో తంటా

- ఆయనను గెలిపించి తప్పు చేశాం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడికి ఫిర్యాదు చేసిన తెలుగు తమ్ముళ్లు



టీడీపీ జిల్లా కార్యాలయంలో గండి బాబ్జీకి ఫిర్యాదు చేస్తున్న భీమిలి నాయకులు

తగరపువలస: ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు వ్యవహారశైలిపై అసంతృప్తితో ఉన్న జీవీఎంసీ భీమిలి జోన్ 2, 3 వార్డు నాయకులు, భీమిలి మండల నాయకులు శుక్రవారం టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీకి ఫిర్యాదు చేశారు. గంటాను గెలిపించుకోవడం తమకు భస్మాసురహస్తం అయిందని వారు బాబ్జీ వద్ద వాపోయినట్లు తెలిసింది. ఈ నెల 7న తాళ్లవలసలో జరగనున్న 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమం గురించి అదే గ్రామానికి చెందిన పార్టీ మండల అధ్యక్షుడు డీఏఎస్ రాజుకు ఇప్పటివరకు సమాచారం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గంటా వెంట ఉన్న వ్యక్తి (స్వామి) ఇప్పుడు కూటమి నాయకుల నెత్తిన కూర్చుని సెటిల్‌మెంట్లు చేస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. గంటా శైలి మారకపోతే తమ దారి తాము చూసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. శనివారం ఢిల్లీ నుంచి రానున్న ఎంపీ భరత్‌కు ఫిర్యాదు చేసిన అనంతరం.. అమరావతి వెళ్లి పార్టీ అధిష్టానం దృష్టికి తమ సమస్యను వివరిస్తామని నాయకులు తెలిపారు. బాబ్జీకి ఫిర్యాదు చేసిన వారిలో డీఏఎస్ రాజు, యరబాల అనిల్ ప్రసాద్, పతివాడ రాంబాబు, సాగిరాజు రాంబాబు, గరికిన పరశురాం, మరగడ రఘురామిరెడ్డి, లక్ష్మణరావు, వివిధ పంచాయతీల నాయకులు ఉన్నారు. అంతకు ముందు వారంతా డీఏఎస్ రాజు ఇంటి వద్ద సమావేశమై భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు.

పాఠశాల విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

మహారాణిపేట: జిల్లాలో పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, అంగన్‌వాడీ పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ శ్రీకారం చుట్టింది. రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం కింద ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వరరావు ఈ కార్యక్రమం కోసం ప్రత్యేక ప్రణాళికను రూపొందించారు. పిల్లల్లో పుట్టుకతో వచ్చే శారీరక, మానసిక లోపాలను గుర్తించి వారికి అవసరమైన వైద్య సేవలు అందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ కార్యక్రమం అమలు కోసం, జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఎల్ఎల్‌హెచ్‌సీలకు అవగాహన, శిక్షణ కార్యక్రమాలను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇప్పటికే పూర్తి చేసింది. తొలుత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు, అంగన్‌వాడీ పిల్లలకు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 636 విద్యాలయాల్లో 96,159 మంది విద్యార్థులు ఉండగా, 914 అంగన్‌వాడీ కేంద్రాల్లో 56,371 మంది చిన్నారులు ఉన్నారు. వీరందరికీ వైద్య పరీక్షలు, పలు వ్యాధులపై స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ బి.హారిక తెలిపారు.

వీఎంఆర్‌డీఏ భూములపై కూటమి కన్ను

- మధ్యతరగతి పేరుతో ప్రైవేట్‌కు పెద్ద పీట
- 'ఐకానిక్' టవర్ ముసుగులో భూముల పందేరం
- మధురవాడలో 4.07 ఎకరాల్లో 50 అంతస్తుల నిర్మాణం
- మిథిలాపురి కాలనీ, మధురవాడ, మారికవలస, వేపగుంట ప్రాంతాల్లో అపార్ట్‌మెంట్లు
- పీపీపీ విధానంలో ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం
- వీఎంఆర్‌డీఏ బోర్డు సమావేశంలో తీర్మానం



బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: కూటమి ప్రభుత్వ ప్లాన్ ఆ పార్టీ నేతలకు కాసుల వర్షం కురిపించనుంది. 'మధ్య తరగతి' పేరు చెప్పి భారీ రియల్ ఎస్టేట్ వ్యాపారానికి స్కెచ్ వేసింది. వీఎంఆర్‌డీఏ స్థలాల అభివృద్ధి పేరుతో విలువైన భూములను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేయాలని నిర్ణయించింది. కూటమి ప్రజా ప్రతినిధులు, వారి అనుచరుల ద్వారా నగరంలో భారీ ఆకాశ హర్మ్యాల నిర్మాణాలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ప్రభుత్వ ఆదేశాలతో శుక్రవారం జరిగిన వీఎంఆర్‌డీఏ బోర్డు సమావేశంలో ఈ ప్రతిపాదనలకు ఆమోదముద్ర పడింది. ప్రైవేట్, పబ్లిక్ భాగస్వామ్యం(పీపీపీ) పేరుతో నగరంలో ఐదు ప్రాంతాల్లో రూ.కోట్లు విలువ చేసే భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టనున్నారు. ఈ స్థలాల్లో భారీ అపార్టుమెంట్లను నిర్మించనున్నారు.

నిబంధనలు పక్కదారి

కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వీఎంఆర్‌డీఏలో పాలన పక్కదారి పట్టింది. ప్రాజెక్టుల టెండర్ల నుంచి షాపుల వేలం వరకు అన్నింటిపై అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలకు కైలాసగిరిపై బ్యాటరీ కార్లకు అనుమతులిచ్చేశారు. దీనిపై 'సాక్షి'లో కథనాలు రావడంతో టెండర్ల ప్రక్రియను చేపట్టారు. సిరిపురం జంక్షన్‌లోని 'ది డెక్'మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ అండ్ కమర్షియల్ భవన నిర్వహణను సింగిల్ టెండర్ వేసిన సంస్థకే కట్టబెట్టేశారు. బీచ్ రోడ్డులో టీయూ–142 మ్యూజియం నిర్వహణ టెండర్.. కూటమి ప్రజాప్రతినిధికి సంబంధించిన కాంట్రాక్టర్‌కు దక్కలేదన్న కారణంగా ఆ టెండర్‌నే రద్దు చేశారు. ఆ పనులకు మళ్లీ టెండర్లను ఆహ్వానించారు. షాపుల లీజుల వ్యవహారం ఒక మాయాజాలంగా మారింది. అప్‌సెట్ ధరలకే షాపుల కేటాయింపులు జరిగిపోతున్నాయి. ఇలా వీఎంఆర్‌డీఏలో అన్ని టెండర్లు, వేలం, ఇతర పనులన్నీ కూటమి ప్రజాప్రతినిధులు, వారి అనుచరుల ఖాతాల్లోకి చేరుతున్నాయి. కూటమి ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల కారణంగా అధికారులు సైతం చేష్టలుడిగి చూస్తున్నారు. వారి ఆదేశాలను శిరసావహించడానికే పరిమితమవుతున్నారు.

మధురవాడలో 50 అంతస్తుల నిర్మాణం

నగరంలో ఐదు ప్రాంతాల్లో పీపీపీ విధానంలో అపార్టుమెంట్ల నిర్మాణానికి వీఎంఆర్‌డీఏ బోర్డు సమావేశంలో అనుమతులు ఇచ్చేశారు. ప్రధానంగా మధురవాడ సర్వే నంబర్ 331/1లో 4.07 ఎకరాల స్థలం ఉంది. ఇందులో 50 అంతస్తులతో ఐకానిక్ రెసిడెన్షియల్ భవనాన్ని నిర్మించడానికి అనుమతించారు. ఇందులో 3, 4 బీహెచ్‌కే ఫ్లాట్స్, 4 బీహెచ్‌కే డూప్లెక్స్‌లతో కలిగిన 6 టవర్లను నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టులో క్లబ్ హౌస్, స్విమ్మింగ్ పూల్, పూల్ డెక్, పిల్లల ఆటల ప్రాంగణం, సైకిల్ ట్రాక్, జాగింగ్ ట్రాక్, ఇతర అత్యాధునిక వసతులతో జాయింట్ మోడల్/పీపీపీ పద్ధతిలో నిర్మాణం చేపట్టనున్నారు. ఇందులో డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు లేకపోవడంతో ఈ ప్రాజెక్టు సామాన్య, మధ్య తరగతి వారు కొనుగోలు చేసే అవకాశం లేదు.

మధ్యతరగతి కోసమంటూ..

వీఎంఆర్‌డీఏకు మిథిలాపురి కాలనీ, మధురవాడ, మారికవలస, వేపగుంట, ఇతర ప్రాంతాల్లో ఉన్న స్థలాల్లో మధ్య తరగతి కుటుంబాలకు అందుబాటులో ధరల్లో అపార్టుమెంట్లను నిర్మించేందుకు బోర్డు అనుమతులిచ్చింది. వీటిలో 2, 2.5, 3 బెడ్‌రూమ్‌లతో ఫ్లాట్లను అభివృద్ధి చేయనున్నారు. వీటిని కూడా పీపీపీ పద్ధతిలో నిర్మాణాలను చేపట్టనున్నారు. దశాబ్దం కిందట వీఎంఆర్‌డీఏ పీపీపీ విధానంలో మధురవాడలో హరిత ప్రాజెక్టును చేపట్టింది. దీని నిర్మాణం ఏళ్ల తరబడి కొనసాగింది. ఈ నిర్మాణంలో అనేక వివాదాలు ముసురుకున్నాయి. దీంతో అప్పటి నుంచి వీఎంఆర్‌డీఏ పీపీపీ విధానంలో మరో అపార్ట్‌మెంట్ నిర్మాణానికి పూనుకోలేదు. తాజాగా కూటమి ప్రభుత్వంలో మళ్లీ అదే విధానం పేరుతో ఆకాశహర్మ్యాలకు సిద్ధమవుతోంది. అయితే ఈ ప్రాజెక్టులను కూటమి నేతలకే చేజిక్కించుకునే అవకాశాలు ఉన్నాయన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

భూములు కొట్టేసేందుకు కుట్ర

విశాఖలో వీఎంఆర్‌డీఏకు విలువైన భూములు ఉన్నాయి. ఈ స్థలాలను ఇప్పటి వరకు పర్యాటక ప్రాజెక్టులకు మాత్రమే పీపీపీ విధానంలో కేటాయించారు. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత వీటిపై ఆ పార్టీల నేతలు, వారి అనుచరుల కన్ను పడింది. వీటిని కొట్టేసేందుకు తెరవెనుక ప్రయత్నాలు మొదలుపెట్టారు. దీనికి తగ్గట్టుగానే కూటమి ప్రభుత్వం వీఎంఆర్‌డీఏ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ధరల్లో అపార్టుమెంట్ల నిర్మాణం పేరుతో ఈ విలువైన భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టేందుకు వీఎంఆర్‌డీఏ బోర్డు కూడా ఆమోద ముద్ర వేసింది. దీని ప్రకారం త్వరలోనే పీపీపీ విధానంలో భూములను రియల్ ఎస్టేట్ సంస్థలకు కేటాయించనున్నారు. కేవలం కూటమి నేతలు, వారి అనుచరులకు లబ్ధి చేకూర్చడానికే ఈ నిర్ణయం తీసుకున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.



ఐకానిక్ రెసిడెన్షియల్ టవర్, ఎంఐజీ హౌసింగ్ నమూనాలు

బోర్డు సమావేశంలో పలు అంశాలకు ఆమోదం

చైర్మన్ ప్రణవ్‌గోపాల్ అధ్యక్షతన జరిగిన వీఎంఆర్‌డీఏ బోర్డు సమావేశంలో కమిషనర్ విశ్వనాథన్‌తో పాటు బోర్డు సభ్యులు వర్చువల్‌గా పాల్గొన్నారు. ఇందులో పలు అంశాలకు బోర్డు ఆమోద ముద్ర వేసింది. మధురవాడ, మిథిలాపురి కాలనీ, మారికవలస, వేపగుంట, ఇతర ప్రాంతాల్లో పీపీపీ విధానంలో అపార్టుమెంట్ల నిర్మాణాలకు ఆమోదించింది.

- అనకాపల్లి జిల్లా కొత్తూరు గ్రామం సర్వే నెంబర్ 608/1పీలో ఉన్న 5.68 ఎకరాల విస్తీర్ణంలో రూ 5.35 కోట్ల వ్యయంతో పిల్లల కోసం సిటీ లెవెల్ పార్క్ నిర్మాణానికి ఆమోదించింది. ఇందులో ఆట స్థలం, యోగా చేసుకునేందుకు యోగా ముద్ర విగ్రహాలతో కూడిన నిర్దేశిత ప్రదేశం, జిమ్ పరికరాలు, యాంఫీ థియేటర్, బాస్కెట్ బాల్, బ్యాడ్మింటన్, టెన్నిస్, ఫుట్‌బాల్ కోర్టులు, స్కేటింగ్ రింక్, ఇతర సదుపాయాలు ఉండనున్నాయి.
- వేపగుంట–పినగాడి బృహత్తర ప్రణాళిక రహదారి అభివృద్ధికి పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. గ్రామీణ ప్రాంతంలో 4 కి.మీ. పొడవైన రోడ్డును వీఎంఆర్‌డీఏ, అర్బన్ ప్రాంతంలో మిగిలిన 3 కి.మీ రహదారిని జీవీఎంసీ మొత్తంగా రూ.14.8 కోట్లతో నిర్మించనున్నారు.
- బీచ్ రోడ్‌లోని వీఎంఆర్‌డీఏ పార్కులో రూ 2.50 కోట్లతో ప్రస్తుతమున్న స్కేటింగ్ రింక్ పక్కనే 63వ జాతీయ రోలర్ స్కేటింగ్ క్రీడా పోటీల నిర్వహణకు, అంతర్జాతీయ పోటీలకు అనువుగా రాష్ట్రంలోనే మొట్ట మొదటి స్కేట్ బోర్డ్ పార్క్ నిర్మాణానికి ఆమోద ముద్ర వేశారు. సమాశంలో రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్, ఇతర బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

రుణాల మంజూరులో బ్యాంకర్లదే కీలక పాత్ర

మహారాణిపేట: సామాన్యులు, రైతుల ఆర్థిక లక్ష్యాలను నెరవేర్చడంలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జరిగిన సమీక్షలో వివిధ బ్యాంకుల ప్రతినిధులు, అధికారులతో ఆయన మాట్లాడారు. వార్షిక రుణ ప్రణాళిక ప్రకారం సేవలను మరింత విస్తరించాలని, రుణ మంజూరు ప్రక్రియలో సరళతర విధానాలు పాటించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందించే రుణాలను సకాలంలో రెన్యూవల్ చేయాలన్నారు. వారి పొదుపు ఖాతాలోని 50 శాతం సొమ్మును ఆటోమేటిక్‌గా ఎఫ్‌డీ చేయాలని ఆదేశించారు. రైతులు, ఎం.ఎస్.ఎం.ఈ. ఔత్సాహికులకు అండగా నిలవాలని, రుణ ప్రక్రియలో సరళతర విధానాలు అవలంబించాలని సూచించారు. వ్యవసాయ, విద్యా రుణాలను త్వరితగతిన మంజూరు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

పథకాలపై లబ్ధిదారులకు అవగాహన

బ్యాంకింగ్ సేవలపై, సైబర్ మోసాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, తగిన సహకారం అందించాలని కలెక్టర్ సూచించారు. వ్యవసాయాధారిత పథకాలు, కిసాన్ క్రెడిట్ పథకం, పీఎం స్వానిధి, పీఎంఈజీపీ, స్టాండ్ అప్ ఇండియా, నేషనల్ అర్బన్, రూరల్ లైవ్లీహుడ్ మిషన్, బీసీ, ఎస్సీ, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా అందే రుణ పథకాలు, అగ్రికల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఫండ్, అగ్రి క్లినిక్ – అగ్రి బిజినెస్ సెంటర్ల ఆవశ్యకతపై సంబంధిత లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు.పీఎం సూర్యఘర్ పథకానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఆగస్టు 15వ తేదీ లోగా కిసాన్ క్రెడిట్ పథకం, మత్స్యకార సేవా పథకాల కార్డుల జారీకి సంబంధించిన ప్రక్రియలను పూర్తి చేయాలని ఆదేశించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావు, హౌసింగ్ పీడీ సత్తిబాబు, యూసీడీ పీడీ సత్యవాణి, డీఆర్డీఏ పీడీ లక్ష్మీపతి, నాబార్డు ఏజీఎం బసంత్ కుమార్, మత్స్యశాఖ, పశుసంవర్ధక, వ్యవసాయ శాఖ జేడీలు లక్ష్మణరావు, కరుణాకరరావు, అప్పలస్వామి పాల్గొన్నారు.

ఇద్దరు వైద్యులపై సీబీఐ కేసు

మహారాణిపేట: వైద్య కళాశాలల్లో అక్రమాలకు పాల్పడుతున్న వైద్యులపై సీబీఐ కొరడా ఝుళిపించింది. నకిలీ రోగులు, డమ్మీ బోధకులతో తప్పుడు పద్ధతుల్లో అనుమతులు పొందిన పలు ప్రైవేట్ మెడికల్ కాలేజీలపై సీబీఐ దృష్టి సారించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా అనధికారికంగా అనుమతులు పొందినట్లు గుర్తించి, విశాఖలోని ఇద్దరు వైద్యులపై కేసు నమోదు చేసింది. గాయత్రీ వైద్య కళాశాలలో పని చేస్తున్న డాక్టర్ కృష్ణకిశోర్, డాక్టర్ వెంకట్‌లపై కేసు నమోదు చేసి, దర్యాప్తును వేగవంతం చేసింది. కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, జాతీయ మెడికల్ కమిషన్ ఉద్యోగులతో పాటు దేశవ్యాప్తంగా పలువురు దళారులు, వైద్యులు కుమ్మక్కై, అవినీతి, అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు సీబీఐ గుర్తించి, కేసులు నమోదు చేస్తోంది.

గ్రూప్-2, గ్రేడ్-2 ఉద్యోగులకు నేడు సీపీటీ పరీక్ష

మహారాణిపేట: ఇటీవల వివిధ నోటిఫికేషన్ల ద్వారా నియమితులైన ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డులోని గ్రేడ్-2 ఉద్యోగులకు, గ్రూప్-2 ద్వారా ఎంపికైన ఉద్యోగులకు శనివారం మూడు సెషన్లలో సీపీటీ (కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్) పరీక్ష జరగనుంది. ఈ పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని డీఆర్వో బీహెచ్ భవానీ శంకర్ ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో ఎగ్జామ్ సెషన్, లైజనింగ్ అధికారులతో సమీక్షించిన డీఆర్వో.. పరీక్ష నిర్వహణపై పలు సూచనలు చేశారు. మొదటి సెషన్‌లో ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 1 నుంచి 2 గంటల వరకు, మూడో సెషన్ సాయంత్రం 4.30 నుంచి 5.30 గంటల వరకు జరగనున్నాయి. పెదంట్యాడలోని ఎస్ఎస్ సొల్యూషన్స్ కేంద్రంలో జరిగే ఈ పరీక్షకు 186 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ఎగ్జామ్ సెక్షన్ సూపరింటెండెంట్ శ్యామ్ ప్రసాద్, లైజనింగ్ అధికారి సూర్యకళ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న వెబ్ ఆప్షన్ల గడువు

మురళీనగర్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి వెబ్ ఆప్షన్ల నమోదుకు శనివారం చివరి తేదీగా అధికారులు ప్రకటించారు. ఈ షెడ్యూల్ మార్పు చాలా మంది విద్యార్థులకు తెలియకపోవడం గమనార్హం. వాస్తవానికి పాత షెడ్యూల్ ప్రకారం జూన్ 25 నుంచి 30వ వరకు వెబ్ ఆప్షన్లు నిర్వహించాల్సి ఉంది. అలాగే జూలై 1న ఆప్షన్ల మార్పిడి, జూలై 3న సీట్ల కేటాయింపు జరుగుతుందని తొలుత ప్రకటించారు. అయితే ఈ షెడ్యూల్‌ను ముందుకు జరుపుతూ వెబ్ ఆప్షన్ల నమోదును జూన్ 30కి వాయిదా వేశారు. దీంతో ఈ నెల 5వ తేదీ వరకు ఆప్షన్లు పెట్టుకునేందుకు అవకాశం కల్పించారు. ఆదివారం వరకు ఆప్షన్లు మార్చుకోవడానికి అవకాశం ఉంది. 9న సీట్ల కేటాయింపు, 10 నుంచి 14 వరకు విద్యార్థులు సెల్ఫ్ జాయినింగ్ రిపోర్టును సమర్పించాల్సి ఉంటుంది.

నేడు జాతీయ లోక్‌అదాలత్

విశాఖలీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని అన్ని న్యాయస్థానాలు, మండల న్యాయ సేవా సంఘాలు(భీమిలి, గాజువాక, అనకాపల్లి, నర్సీపట్నం, యలమంచిలి, చోడవరం, మాడుగుల, అరకు, చింతపల్లి, పాడేరు)లో లోక్ అదాలత్ జరగనుందని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4,710 కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నాయి. ఇందుకోసం మొత్తం 37 బెంచ్‌లను అన్ని కోర్టుల సముదాయాల్లో ఏర్పాటు చేశారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూచించారు.

అనస్థీషియాలో ఆధునిక పోకడలు

విశాఖ వేదికగా నేటి నుంచి వైద్యుల సదస్సు

మధురవాడ: విశాఖ వేదికగా 40వ ఇండియన్ సొసైటీ ఆఫ్ అనస్థీషియాలజిస్ట్స్ సౌత్ జోన్ కాన్ఫరెన్స్ శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్లు ఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాసరావు, నిర్వహణ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజశేఖర్ తెలిపారు. అనస్థీషియా వైద్యంలో వస్తున్న కొత్త పరిజ్ఞానంపై అవగాహన, రోగులకు మరింత మంచి సేవలు అందించే విషయాలు పరస్పరం తెలుసుకునేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం మధురవాడ వి.కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన సమావేశంలో వారు ఇతర రాష్ట్ర, జిల్లా ప్రతినిధులతో కలసి మాట్లాడారు. ఆధునిక నొప్పి నివారణా పద్ధతులు, వైద్యంలో వస్తున్న మెళకువలు, పరిజ్ఞానం ఎక్స్ఛేంజ్ తదితర అంశాలు సదస్సులో ఉంటాయన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాసరావు

సదస్సుకు సౌత్ ఇండియా పరిధిలోని ఏపీ, తెలంగాణాతో పాటు కేరళ, కర్ణాటక, పాండిచ్చేరి, ఒడిశా, మధ్యప్రదేశ్‌కు చెందిన 1,300 మంది ప్రతినిధులు హాజరు కానున్నా రని పేర్కొన్నారు. ఈ రంగంలో ఉన్న పీజీ విద్యా ర్థులు, ప్రాక్టీషనర్స్‌కు అవసరమయ్యే 36 రకాల పరికరాలతో కూడిన ఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

సీఎం చంద్రబాబుపై ఫిర్యాదు

బీచ్‌రోడ్డు: గుంటూరులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సింగయ్యపై రాష్ట్ర సీఎం చంద్రబాబు అసభ్యకర వ్యాఖ్యలు చేశారంటూ వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు మూడో పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం సీఐ పైడయ్యకు అందజేసిన ఈ ఫిర్యాదులో.. మృతిచెందిన వ్యక్తిని ఉద్దేశించి చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ఘోరమైనవి, కుల ప్రాతిపదికన కించపరిచేవిగా ఉన్నాయన్నారు. అవి ఎస్సీ మాదిగ సామాజిక వర్గ మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు బోని శివరామకృష్ణ మాట్లాడుతూ సింగయ్య మృతి పట్ల చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఈ కేసు కోర్టులో విచారణలో ఉన్నప్పుడు ప్రజాప్రతినిధులు ఈ విధంగా వ్యాఖ్యలు చేయడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. చంద్రబాబు తన ప్రసంగంలో సింగయ్య గురించి 'కుక్క మాదిరిగా తీసి పక్కన పడేసి వెళ్లిపోయారు' వంటి పదాలు వాడారని, ఈ వ్యాఖ్యలు అమానుషమైనవని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శెట్టి కామేశ్వరరావు, దేవరకొమడ మార్కండేయులు తదితరులు పాల్గొన్నారు.



సీఐకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు బోని శివరామకృష్ణ తదితరులు

'ప్రసాద్' పనుల వేగవంతానికి కృషి

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

సింహాచలం: వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయ క్షేత్రంలో కేంద్ర ప్రభుత్వం రూ.54 కోట్లతో చేపట్టిన ప్రసాద్ పథకం పనులను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకుంటానని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ అన్నారు. శుక్రవారం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సింహాచలం దేవస్థానంలో రూ.54 కోట్లతో చేపట్టిన ప్రసాద్ పథకం అభివృద్ధి పనులు 50 శాతం పూర్తయ్యాయని, మిగిలిన 50 శాతం పనులు వేగంగా జరిగేలా చూస్తానన్నారు. వరాహ పుష్కరిణి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పూల తోట, గోశాల ఎంతో పురాతనమైనవని, వాటి వైభవం మరింత పెరగాలన్నారు. భైరవ స్వామి ఆలయానికి వెళ్లే మార్గాన్ని పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. దర్శనార్థం వచ్చిన మాధవ్ ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడా మండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో ఆయన పేరు మీద అర్చకులు స్వామికి అష్టోత్తర పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, జ్ఞాపిక, శేషవస్త్రాలను దేవస్థానం ఈవో వి.త్రినాథరావు అందజేశారు. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరెడ్డి, 98వ వార్డు అధ్యక్షుడు ఆర్. వర్మ, విశ్వహిందూ పరిషత్ నాయకుడు పూడిపెద్ది శర్మ తదితరులు పాల్గొన్నారు.



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న మాధవ్ దంపతులు

బాలికపై లైంగికదాడికి యత్నం



చంద్రశేఖర్

బీచ్‌రోడ్డు: నగరానికి చెందిన బాలికపై లైంగికదాడికి పాల్పడిన కేసులో స్విగ్గీ డెలివరీ బాయ్ పిన్నింటి చంద్రశేఖర్‌ను మూడో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ సంఘటన మద్దిలపాలెం సీఎంఆర్ వెనుక వైపున ఉన్న వినాయక్ నగర్‌లో జరిగింది. శ్రీకాకుళం జిల్లా రణస్థలానికి చెందిన పిన్నింటి చంద్రశేఖర్ కొన్నేళ్లుగా వినాయక్‌నగర్‌లో నివాసం ఉంటూ.. స్విగ్గీ డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు. చంద్రశేఖర్ ఉంటున్న ఇంటి కిందనే ఏడో తరగతి చదువుతున్న బాలిక కుటుంబం ఉంటోంది. ఇంట్లో తల్లిదండ్రులు లేని సమయంలో చంద్రశేఖర్ ఆ బాలికను తన ఇంటికి పిలిచాడు. బాలిక పైకి రాగానే ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. దీంతో బాలిక పెద్దగా అరవడంతో చుట్టుపక్కల వారు చేరుకుని ఆమెను రక్షించారు. సమాచారం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు జరిగిన విషయంపై మూడో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏసీపీ లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో పోలీసులు చంద్రశేఖర్‌పై పోక్సో కేసు నమోదు చేశారు. అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం కేజీహెచ్‌కు తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తులు

అరిలోవ: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు–2025 కోసం ఈ నెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఎన్. ప్రేమ్‌కుమార్ సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు https://nationalawardstoteachers.education.gov.in/ ద్వారా తమ దరఖాస్తులు పంపించాలన్నారు. అర్హతలు, నిబంధనలు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, వాటిని పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలని డీఈవో కోరారు.